అవినీతికి పాల్పడితే చర్యలు : డ్వామా పీడీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఉపాధి హామీలో అవకతవకలకు, అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి హామీ పీడీ మద్దిలేటి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2031 పనులకు రూ.6,91,84,335, మెటీరియల్‌కు రూ.1,03,894 ఖర్చు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కొన్ని పనులలో రూ.1,36,215 అవకతవకలు జరిగాయని, వాటిని రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి నందకుమార్, డివిపి ప్రకాష్, ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఎపిఒ ప్రసాద్ బాబు, ఎస్ఆర్‌పి చంద్రమోహన్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తూనే రహదారులపై బైటాయించి రాస్తారోకోలు నిర్వహించారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల రాస్తారోకోను నిర్వహించకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల ఆంక్షలను లెక్కచేయకుండా అంగన్వాడీలు తమ నిరసనను కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

రహదారులు దిగ్బంధం

రాస్తారోకో, మానవహారాలతో కదం తొక్కిన అంగన్వాడీలు - రాజంపేటలో ఉరేసుకుని వినూత్న నిరసన

మంత్రి ఉషశ్రీ, ప్రతాప్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలంటూ ఆగ్రహం - 11వ రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వం అంగన్వాడీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరి వీడి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసెడెంట్ డి.భాగ్య లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చెక్‌పోస్ట్ శివాలయం వద్ద చిత్తూరు, మదనపల్లి మూడు రోడ్ల సర్కిల్‌లో జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. ప్లేట్లు, గ్లాసులు కొడుతూ ప్రభుత్వానికి తమ నిరసనను వినూత్నంగా తెలియజేశారు. జాతీయ రహదారిపై సుమారు గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సెంటర్ల తాళాలు పగలకొట్టమని సచివాలయ ఉద్యోగుల చేత చేయిస్తూ మరో వైపు సమస్యల పరిష్కారానికి సానుకూలం అంటూ చెప్పడం సరైంది కాదన్నారు. అంగన్వాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఉషశ్రీ చరణ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ అంగన్వాడీలు విధులకు హాజరు కావాలని, మూడు నెలల్లో సమస్యలను పరిష్కారం చేస్తామంటూనే వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు ఐసిడిఎస్ విధుల నిర్వహణ నిమిత్తం డబ్బులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నిత్యం కష్టపడే అంగన్వాడీలకు డబ్బులుండవా అని ప్రశ్నించారు. లబ్దిదారులకు ప్రభుత్వం మీద వ్యతిరేకత తగ్గించడానికి హడావుడిగా సిబ్బందిని సమకూర్చే పని చేస్తోందని తద్వారా ప్రీస్కూల్ నిర్వాహణ దెబ్బతింటోందన్నారు. పిల్లల ఆలనా పాలనా చూడడం అంగన్వాడీలకు తప్ప మరెవ్వరూ చూడలేరని తెలిపారు. సచివాలయ సిబ్బంది అంగన్వాడీల సెంటర్లలో క్రికెట్ ఆడుతున్నారని విమర్శించారు. మంత్రులు అధికారులు చౌకబారు దుష్ప్రచారం మాని అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కార పోరాటాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డి.వెంకటయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు బంగారుపాప, సిద్ధమ్మ, విజయ, సుమలత, రమణమ్మ, పద్మజ, నాగమణి, ప్రవీణ, లక్ష్మీదేవి, అరుణ, జలజ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి సికిందర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు రాయుడు, ఏరియా కార్యదర్శి శివరామకృష్ణ దేవర, అంగన్వాడీలు రమాదేవి, సుజాత, ఈశ్వరమ్మ, శివరంజని, విజయ, అమరావతి పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య మద్దతు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో అంగన్వాడీలు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో జనసేన చేనేత వికాస రాష్ట్ర కార్యదర్శి రాటాల రామయ్య, వీర మహిళలు రజిత, అబ్బిగారి గోపాల్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మొలకలచెరువు మండలం అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. **రైల్వేకోడూరు:** మంత్రి ఉషశ్రీ చరణ్ అంగన్వాడీలపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని స్థానిక టోల్గేట్ సెంటర్ వద్ద రాస్తారోకో చేపట్టి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీలక్ష్మి, రైల్వేకోడూరు ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎన్.రమాదేవి, ప్రాజెక్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాధా కుమారి, కోశాధికారి జి.పద్మావతి, గౌరవ అధ్యక్షులు డి.వనజ కుమారి, సెక్టార్ లీడర్స్ లీలావతి, దుర్గ, శిరీష, మునీంద్ర, ఈశ్వరమ్మ, సుజాత, బి.వాణి, వి.స్వర్ణలత, వై.మణెమ్మ, చెంచులక్ష్మి, రాధా, నాగలత, ప్రసన్నకుమారి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు జాన్ ప్రసాద్ పాల్గొన్నారు. **పీలేరు:** స్థానిక జాతీయ రహదారిపై అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పీలేరు, కెవి పల్లి, కలకడ మండలాల అంగన్వాడీలు, సిఐటియు, ఎఐటియుసి నాయకులు వెంకట్రామయ్య, టిఎల్ వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు. **మదనపల్లి:** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నుండి ర్యాలీ నిర్వహించి, అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రోడ్డుపై ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు తెలకపల్లి హరింద్రనాథ్ శర్మ, ప్రభాకర్ రెడ్డి, మధురవాణి, రాజేశ్వరి, గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అభిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి పాల్గొన్నారు. సమ్మెకు ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు శోభారాణి, సబిత, కౌలు రైతు సంఘం కార్యదర్శి రమేష్ బాబు సంఘిభావం తెలిపారు. **తంబళ్లపల్లె:** తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాలలోని అంగన్వాడీలు ఐసిడిఎస్ కార్యాలయం నుండి రాగి మాను రచ్చ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు కరుణశ్రీ, సులోచన, గౌరీలు కోరారు.

రాయచోటి : జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు

రాజంపేట : ఉరి వేసుకుని వినూత్నంగా నిరసన చేస్తున్న అంగన్వాడీలు

రైల్వేకోడూరు : టోల్‌గేట్ వద్ద మానవహారం ఏర్పడిన అంగన్వాడీలు

మదనపల్లె : సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించిన అంగన్వాడీలు

మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్

హామీలను సిఎం జగన్ నిలబెట్టుకోవాలి

- భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సిఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వల్ల నాలుగన్నర ఏళ్లుగా ప్రజలు కోల్పోయినవన్నీ ఎన్నికల నోటిఫికేషన్‌లోగా వడ్డీతో సహా తిరిగి ఇచ్చేయాలని భారతీయ అంబేద్కర్ సేన అన్నమయ్య జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, విసికె పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు తదితర కార్పొరేషన్లకు వెంటనే నిధులు మంజూరు చేసి, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, జంబో నోటిఫికేషన్ ఇచ్చి పెద్ద సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, కాంట్రాక్టు - ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఇచ్చిన మాట ప్రకారం అంగన్వాడీ ఉద్యోగుల జీతాలు పెంచాలని, ఇండస్ట్రియల్ డిపార్ట్మెంట్‌కు నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలు, ఇతర రాయితీలు వెంటనే చెల్లించాలని, సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కొత్తగా తెచ్చిన భూ చట్టాన్ని రద్దు చేయాలని, మద్యపాన నిషేధం హామీని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా అమలు చేసి మాట నిలబెట్టు కోవాలని, కుల-మత హింసను, స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పొందే హక్కుకు భంగం కలిగించే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్ రెడ్డి, నరసింహులు, సూరి, గురునాథ్, పెద్దోడు, గంగాధర్, పెద్ద నరసింహులు, నగేష్ పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్

ప్రజా శక్తి రాయచోటి

కలెక్టర్ కార్యాలయంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం ఉదయం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అన్నమయ్య జిల్లా వారు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అపోలో ఫార్మసీస్ లిమిటెడ్ వారు ఫార్మసిస్టు, ఫార్మసీ అసిస్టెంట్, ఉద్యోగాల కొరకు, వినూత్న ఫెర్టిలైజర్స్ వారు సేల్స్ రెప్రజెంటే షన్ ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమా, ఏదైనా డిగ్రీ, డి ఫార్మసీ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, పీజీ అర్హత గల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. ఆయా కంపెనీలలో ఎంపికైన వారికి నెలకు రూ.8 వేల నుంచి రూ.20 వేల వరకు హోదాను బట్టి జీతం ఇస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫొటోలు తీసుకొని రావాలన్నారు. ఆసక్తి గల మహిళా, పురుష అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొని మీ అర్హతకు తగిన ఉద్యోగం పొందవచ్చునని మరిన్ని వివరాలకు 9153695289 నెంబర్ను సంప్రదించాలన్నారు.

జాబ్ కేలండర్ విడుదల చేయాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వం వెంటనే జాబ్ కేలండర్ విడుదల చేయాలని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర మహాసభల పిలుపులో భాగంగా డిసెంబర్ 22వ తేదీన నిరుద్యోగ సమస్యలపైన, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి నిర్వహించాలని జనవరిలో జాబ్ కేలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ కేలెండర్‌ను విడుదల చేస్తామని తన మేనిఫెస్టోలో పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తయినా నేటికీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు పృథ్వి, శివ శంకర్, వర్షిత్ సాయి, శ్రీనివాసులు, వేద రక్షిత్, చిన్నపురెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో

విద్య, వైద్య శాఖల పాత్ర కీలకం : జెసి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

మాదకద్రవ్యాల నిర్మూలనలో వైద్య, విద్య శాఖల అధికారుల పాత్ర కీలకమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు, అటవీ, విద్య, వైద్య తదితర శాఖల అధికారులతో జిలా స్థాయి నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు, విద్య, వైద్య తదితర శాఖల వారు తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ శాఖల అధికారులు జెసికి వివరించారు. పోలీసు శాఖ వారు మాట్లాడుతూ వివిధ పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, అదేవిధంగా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న లేదా కొంటున్న, వాటిని సాగు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన కోసం 14500, 7382296118 టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసినట్లు జెసికి తెలిపారు. వైద్యశాఖ అధికారులు మాట్లాడుతూ మదనపల్లిలోని జిల్లా ఆసుపత్రిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లుగా తెలిపారు. మదనపల్లిలో ముగ్గురు 20 సంవత్సరాలలోపు విద్యార్థులు మాదక ద్రవ్యాల వాడకంను గుర్తించామని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నట్లుగా తెలిపారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలలో మాదకద్రవ్యాలు లేకుండా చేసేందుకు మాదకద్రవ్యాల కమిటీల ద్వారా పర్యవేక్షి స్తున్నట్లుగా తెలిపారు. రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, మదన పల్లిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధులు వారి వారి కళాశాలలలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను జెసికి వివరించారు. జిల్లా డ్రగ్స్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఉన్న మెడికల్ షాపులను తనిఖీ చేస్తున్నామని, కొన్ని మెడికల్ షాపులు కాస్మోటిక్, డ్రగ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్టుగా ప్రాథమికంగా తెలుసుకున్నామని వారిపై తగు చర్యలు తీసుకుంటామని జెసికి వివరించారు. అనంతరం జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల సరఫరా, వాడకాన్ని ఉపేక్షించరాదని, పోలీసు శాఖ వారు గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించి వారి భవిష్యత్తులో కలగబోయే నష్టాలను వివరించి విద్యార్థులను మంచి బాటలో నడిపించాలన్నారు. 9, 10 వ తరగతి విద్యార్థులకు మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వారికి తగిన రీతిలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో రాజంపేట, మదనపల్లె ఆర్‌డిఒలు రామకృష్ణారెడ్డి, మురళి, ఎక్సైజ్ శాఖ, అటవీ శాఖ, విద్య, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటు : డిసిసి

ప్రజాశక్తి రాయచోటి

దుండగులు చొరబడిన సంఘటనలో ప్రశ్నించిన లోక్‌సభ, రాజ్యసభ నుంచి 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి భారత ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేసిందని డిసిసి అధ్యక్షుడు షేక్ అల్లాబకష్ విమర్శించారు. నూతన పార్లమెంటు బాధ్యత వైఫల్యం, ఎంపీల సస్పెన్షన్, ప్రధాని మోడీ నిరంకుశ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ అన్ని విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, అన్ని నియోజకవర్గాల కన్వీనర్లతో కలిసి నల్ల కండువాలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అలాంటి ఈ దేశంలో ఇప్పుడు అరాచక పాలన సాగుతోందని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఏ దేశంలోనూ 15 మంది చట్టసభ సభ్యులను సస్పెండ్ లేదని, బహిష్కరించలేదని చెప్పారు. మోడీ నిరంకుశ నియంతృత్వ ధోరణికి నిలువ దర్పణం బిజెపి అని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో మదనపల్లి నియోజకవర్గం నాయకుడు రెడ్డిబాష, రైల్వేకోడూరు నియోజకవర్గ నాయకులు గోసాల దేవి, రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీక్, డిసిసి మైనార్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్నకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాదరవల్లి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్‌బాష, జిల్లా ఉపాధ్యక్షులు అఫ్రీన్, జనరల్ సెక్రటరీస్ బషీర్ అహ్మద్, వెంకటరమణ, చలపతి, నాగరాజా, మండల అధ్యక్షులు రమణ, నూరుల్లా, చంద్రశేఖర్, చలపతి, తాలూకా మహిళా అధ్యక్షులు రమణమ్మ, మహబూబ్జాన్, లక్ష్మీ కళ, రఫీక్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

'మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గ్రామ స్థాయిలోని సమస్యలను మండల స్థాయిలోనే అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం రాజంపేట ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమం నిర్వహించారు. జెసితోపాటు ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గ్రామ స్థాయి సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అయ్యేలా మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్ర వారాల్లో ఒక్కొక్క రోజు ఒక్కో మండలంలో "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం అందించే దిశగా ప్రభుత్వం "జగనన్నకు చెబుదాం" కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హతలు ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోలేని వారు వెంటనే వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ పథకాల లబ్ది పొందాలన్నారు. "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని జేసి అధికారులకు సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి జెసి, ఆర్‌డిఒ అర్జీలు స్వీకరించి పరిష్కారం కొరకు వాటిని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు తరలించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతగా సమస్యలను సత్వరం పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మొత్తంగా దాదాపు 100 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా కాల పరిమితిలోపు నాణ్యతగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపిడిఒ ఫణిరాజకుమారి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లాఅధికారులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయులు

యువగళం విజయంతో వైసిపిలో వణుకు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నారా లోకేష్ యువగలం నవశకం విజయవంతం కావడంతో వైసిపి పార్టీ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల వెన్నులో వణుకు పుట్టిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్‌రాయుడు తెలిపారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోకేష్ యువగళం ముగింపు సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారని తెలిపారు. ఆ ప్రజలను చూసి వైసిపి నాయకులు ముడుచుకు పోయారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి తప్పకుండా విజయం సాధిస్తుందని జోష్యం చెప్పారు. లోకేష్ పాదయాత్రకు వైసిపి వారు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎన్నో రకాలుగా అడ్డంకులు సృష్టించినా ప్రజలు మాత్రం పాదయాత్రకు పట్టం కట్టారని తెలిపారు. ఈ యువగలం పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఏరోజైతే జనసేన, టిడిపి పొత్తు ప్రకటించారో ఆరోజే టిడిపి విజయం సాధించినట్లు ప్రజలు, ఓటర్లు తేల్చి చెప్పారని తెలిపారు. సిఎం జగన్ సభను విఫలం చేయడానికి పోలీసులు చేత ఎన్నో అడ్డంకులు సృష్టించారని, ఆఖరుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు కూడా రానివ్వకుండా, అనుమతులు ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. చివరకు 5 రైళ్లు, 5 వేల ఆటోలు ద్వారా ప్రజలు పెద్ద ఎత్తున ముగింపు సభకు స్వఛ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారని వివరించారు. రాజంపేట నుంచి కూడా పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు తరలివచ్చారని, వారందరికీ కూడా ప్రత్యేక కృతజ్ఞతాభివందనములు తెలియజేస్తున్నానని తెలిపారు. టిడిపికి అభిమానులు జన సునామీగా తరలి రావడం చూస్తుంటే ఓటర్లలో ఎంత మార్పు వచ్చిందా అన్న ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి తప్పకుండా అధికారంలోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పదాదికారులు పాల్గొన్నారు.

'ఆదిత్య' విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-మదనపల్లి



స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియుఎ అనంతపురం 13వ కాన్వకేషన్ సందర్భంగా తమ కళాశాల విద్యార్థిని ఎం.షాహిస్తా ఖానం 2022వ బ్యాచ్ సివిల్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణురాలైన 2018-2022 సంవత్సరంకుగాను ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ఈ ప్రతిభా పురస్కారాన్ని 2024 జనవరి ఆరవ తేదీన విద్యార్థినికి అందజేయనున్నారన్నారు. కళాశాల చైర్మన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎన్.నాగ మల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి విద్యార్థినిని అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఒడి ఎస్.వినయ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినిని అభినందించారు.

'వెలుగు'లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక వెలుగు సంస్థలో శుక్రవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి తెలిపారు. వెలుగు చిన్నారులు, సిబ్బంది క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి దాన్ని అలంకరించి యేసు క్రీస్తు జన్మదినాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు జరిపారన్నారు. వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి, క్రిస్మస్ వేడుకను ప్రార్థనతో ప్రారంభించి గీతాలాపన చేసి, క్రీస్తు జన్మను గూర్చి బైబిలు వాక్యపఠనంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, వెలుగు సిబ్బంది స్వీటీ, అనుపమ, చిన్నారులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన శాఖ అధికారి నాగమణి

మామిడిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-రామాపురం

మామిడి సాగు రైతులు పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు చేపడం వల్ల అధిక దిగుబడులను పొందవచ్చునని అక్కిరెడ్డిపల్లి ఉద్యాన శాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. మండలంలోని సుద్దమల్ల, నల్లగుట్టపల్లి గ్రామాల్లో మామిడి రైతులకు పూత, పిందె సమయంలో చేపట్ట వలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పూత తర్వాత ఒకే సారి రావడానికి, పూల రాలు తెరగానికి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలిపారు. పూమొగ్గ దశలో తేనె మంచు పురుగు, మసి తెగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉండని వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఒక లీటర్ నీటికి మ్యూకోజెట్ 2 గ్రా.లీటర్ నీటికి పిచికారి చేయాలని సూచించారు. నల్ల పూతదశ పిందె బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనె మంచుపురుగు, తామర పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు, మరియు పిందె రాలడం నివారణకు ఇమ్రోఫ్లోజిన్, ఎసిఫేట్ 1 గ్రా. లీటర్ నీటికి, సాఫ్ 2గ్రా. లీటర్ నీటికి ప్లానోఫిక్స్ 0.25 మి.లీ లీటర్ నీటికి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. మామిడి కాయ గోలికాయ దశ నుంచి నిమ్మకాయ దశ వరకు ఆశించే తామర పురుగు కుళ్లు తెగులు నివారణకు ఇమిడాక్ 1 మి.లీ లీటర్ నీటికి నాటిపో 1 గ్రా. లీటర్ నీటికి పిచికారి రైతులకు తెలిపారు. కార్యక్రమానికి రైతు భరోసా కేంద్ర సహాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, లక్ష్మీదేవి రైతులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

ప్రజాశక్తి-కలకడ

సామాజిక తనిఖీ బహిరంగ సభను శనివారం నిర్వహించినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.మండలంలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ తనిఖీలు ఈనెల 5 నుంచి 22వ తేదీ వరకు 16 గ్రామ పంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులను తనిఖీలు చేసినట్లు తెలిపారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

సినీ హీరో ప్రభాస్ సినిమా సలార్ చిత్రం విడుదల సంద ర్భంగా పట్టణం లోని చందన్ థియే టర్ లో అభిమా నులతో కలిసి సినిమా వీక్షించి అనం తరం అన్నదాన కార్య క్రమం చేపట్టారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి,స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్ధన, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, కొండారు సుదర్శన్ రాజు, కంప రాజు నాగేంద్ర రాజు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఉరుసు :'మేడా'

నందలూరు : హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా ఉరుసు ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని ఆరవపల్లిలోని హజరత్ ఖాదరవల్లి దర్గా ఉరుసు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ కలిసిమెలిసి ఐక్యతతో ఉరుసు ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్ర మంలో దర్గా కమిటీ అధ్యక్షులు కమల్‌బాషా, కోశాధికారి ఖాదరవల్లి, కార్యదర్శి సయ్యద్ అమీర్, కరీముల్లా, షమీముల్లా, మండల జెసిఎస్ కన్వీనర్ కరిముల్లా, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్య నారాయణ, జెడ్పిటిసి సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగేంద్ర, టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, జుల్ఫికర్, మన్సూర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్

ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మంజునాథ వలి తెలిపారు.మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు కమిటీ చైర్మన్ మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో బైజూస్ కూడిన ట్యాబ్ లను విద్యార్థుల తల్లిదండ్రులకు ఆప్యాయంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా ఇచ్చిన ట్యాబ్‌లను సక్రమమైన రీతిలో వినియోగించుకొని అసమానతలను ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

పుల్లంపేట: మండలం కేంద్రంలోని పిహెచ్ కాలనీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నాన్ భవిత సెంటర్లో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు ఆటల పోటీలో నిర్వహించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు రాజంపేట వాసవి సహృదయ సేవా ట్రస్ట్ అధ్యక్షులు శరత్ బాబు ఆధ్వర్యంలో బహుమతులను అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు, పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమ్మెక్య సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి, ఐఇఆర్‌పి విజయకుమారి, సునీత, వాసవి సహృదయ సేవ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల కేంద్రమైన బి.కొత్తకోటలో మండల స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు.ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వ చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మండలం లో జరుగుతున్న అభివృద్ధి పురోగతిపై ఈ సమావేశంలో చర్చించారు.ఈ సమావేశానికి ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మెంబర్ కె.వి.రమణ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ శాఖ నుంచి భూ సమస్య చాలా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.ఈ విషయంపై మండల రెవెన్యూ అధికారులు పరిష్కారం కానివి ఏమైనా ఉంటే ప్రతినెల కలెక్టర్ నిర్వహించే సమావేశాలకు వెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.ఎంపిపి లక్ష్మీ నరసమ్మ మాట్లాడుతూ అధికారులు ఎస్‌సి,ఎస్‌టిల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టీ, క్రిస్టియన్లకు కన్వర్ట్ అయిన కుటుంబాలకు శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరగా స్థలం కేటాయిస్తామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భవాని వెంకటేష్, భారతీయ అంబేద్కర్ సేన సింగన్న, సదన్, పలక వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు నిర్మిస్తే కఠిన చర్యలు

బి.కొత్తకోట: నగర పంచాయతీ పరిధిలో అక్రమ లేఔట్లు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని బి.కొత్తకోట కమిషనర్ పి.ఆర్.మహేంద్ర పేర్కొన్నారు. నగర పంచాయతీలో వెలసిన అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులకు సిబ్బంది ద్వారా నోటీసులు అందజేశారు. శుక్రవారం మదనపల్లె రోడ్డులో నూతనంగా వేస్తున్న లేఅవుట్లో హద్దు నిమిత్తం నాటిన రాళ్ల తొలగించారు. అనుమతులు తీసుకోకుండా వేసే లేఅవుట్లలో ఎవ్వరు ప్లాట్లు వద్ద నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు నగర పంచాయతీ అనుమతులు కలిగిన లేఅవుట్లలోనే ఇంటి స్థలాలు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ గణిత మేధావి రామానుజన్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గణిత మేధావి శ్రీనివాస్ రామానుజన్ జయంతిని పురస్కరించుకొని బి.కొత్తకోట పట్టణం,బెంగళూరు రోడ్డులోని సుంకు జూనియర్ కళాశాలలో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రిన్సిపాల్ మంజునాథ్ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ రామా నుజన్ గణితశాస్త్రంలో ఎన్నో ఫార్ములాలను కనుగొన్నా రన్నారు. 1887లో జన్మించిన ఆయన గణితంలో 3900 సమస్యలకు సులభ తరమైన పరిష్కారాలను కొనుగొన్నారని తెలిపారు. 32 వయస్సులోనే ఆయన మరణించడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. **కలికిరి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లారి తిమ్మారెడ్డి, సర్పంచ్ ప్రతాప్‌కుమార్ రెడ్డి హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు కరీముల్లా, నాగార్జున, సిఆర్‌పిలు సురేష్ భాస్కర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మురాసవల్లి, అప్సర్, ఖాదరవల్లి, అజంతుల్లా, ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సెంట్రల్ సిఇఒ రాధ, రాజంపేట సిఇఒ రఘురామరాజు విద్యార్థులకు సూచించారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గత రెండు రోజులుగా రాజు పాఠశాలలో విద్యార్థులచే ప్రయోగాత్మక నమూనాలు చేయించి వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ సిఇఒ రాధ, రాజంపేట సిఇఒ రఘురామరాజు, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జి మోహన్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులు బాలగంగాధర్, జయప్రకాష్, శిరీష, వెంకటేష్, లక్ష్మిలు పాల్గొన్నారు. **నందలూరు :** సమాజంలో శాస్త్రీయ దృక్పథం నెలకొల్పడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జెవివి జిల్లా నాయకులు షేక్ రౌఫ్‌బాషా, మండల నాయకులు కృపానందం, ఎం.వి రమణ తెలిపారు. స్థానిక నందలూర్ హై స్కూల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విభాగాల్లో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు సైన్స్ భావజాలాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. టాలెంట్‌టెస్ట్‌లో ప్రయివేట్ స్కూల్ విభాగంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, ద్వితీయ స్థానం, మూడవ స్థానం ఆల్విన్ మౌంట్ కార్మెల్ స్కూల్ రెండు టీంల విద్యార్థులు సాధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్‌టియు నాయకులు షఫీఉల్లా, యుటిఎఫ్ నాయకులు రమేష్, జెవివి నాయకులు బాబు, మనోహర్, నాగలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. తర్వాత విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. **నిమ్మనపల్లి :** నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) నందు శ్రీ శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఎపి కాస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు గణితం పై క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట గోపాల్, రేణుక, కుల్లాయి రెడ్డి, రెడ్డి శేఖర్, రమణప్ప, రాజేంద్ర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శన ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి-1 చక్రధర్ రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్‌ఎం రమణారెడ్డి, ఉపాధ్యాయులు షామీర్, గిరిధర్, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, ఆసిఫ్ భాష ,శేషాద్రి, హేమలత ప్రమీల పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను పోటీతత్వం ద్వారా వెలికితీయవచ్చునని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సావిత్రి అన్నారు.గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మ్యాథ్స్ మోడల్స్, ఎగ్జిబిషన్, క్విజ్, గణిత శాస్త్రవేత్తల జీవిత చరిత్రపై వకృత్వ పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పలత, శేఖర్ రెడ్డి, భాస్కర్ నాయక్, నాగరాజ, విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు:** పట్టణంలోని వివిఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలను వైభవంగా జరిపారు. శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యాసంస్థ కరస్పాండెంట్ వి. మాధవి గణిత సంబరాలను నిర్వహించి విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత్రి మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై ఆసక్తిని పెంచుకుని వివిధ రంగాల్లో ప్రతిభను కనబరచాలని అన్నారు. గణితం అంటే సమస్య కాదు సాధన అనే విషయాన్ని విద్యార్థులు తెలుసుకుని గణితంలోని మెళకువలను గ్రహించి ప్రతి విద్యార్థీ గణితంలో ఆసక్తి కనబరచాలని సందేశం ఇచ్చారు. విద్యార్థులకు ఫజిల్స్, నమూనామేళా, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యములు సి. సురేష్, గణిత ఉపాధ్యాములు బాబురెడ్డి, త్రివిక్రమ్, వరలక్ష్మి, ఫెరోజ్ పాల్గొన్నారు.

కలికిరి : బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పీలేరు :గణిత దినోత్సవంలో విఎస్ఎన్ సిద్ధార్థ స్కూల్ ఉపాధ్యాయులు

సిఎం జగన్‌కు ఓటమి భయం : టిడిపి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజనరీ నాయకుడని సైకో జగన్‌రెడ్డి ఒక ప్రిజనరీ అని అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది తరలివచ్చి నవ శకానికి నాంది పలికారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ సభకు విచ్చేసి కార్యకర్తలకు ఉత్సాహాన్ని అందించారని అన్నారు. ఈ సభ విజయవంతం కావడంతో వైసిపి నేతల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. టిడిపి జనసేన పొత్తు చారిత్రాత్మకమని చంద్రబాబు పేర్కొనడం తద్వారా ఈ రాష్ట్రంలో తిరిగి టిడిపి జనసేన కూటమి అధికారం చేజిక్కించుకుంటుందన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది కేజేపి రెడ్డయ్య. ఓబులవారిపల్లి మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరాజు, మాజీ జెడ్పిటిసి నాయుడోరి రమణ, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులేల రమేష్, టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ పోగూరి శివయ్య, మాజీ సర్పంచ్ గడికోట సుబ్బరాయుడు, ఓబుల వారిపల్లి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చప్పిడి రమేష్ బాబు, రాజంపేట పార్లమెంట్ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులుచిన్న, చంద్రమౌళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

చెకుముకి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

వాల్మీకిపురం : విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండల వ్యాప్తంగా నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పోటీల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షలలో విజేతలుగా జిల్లా పరిషత్ పాంశాల చింతపర్తి గ్రామం విద్యార్థులు తరుణ్ రెడ్డి, కీర్తన, హన్సిక ప్రథమ స్థానంలో, పివిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తేజేష్, నవ్య శ్రీ, మణితేజ ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు షీల్డ్, పతకాలు, ప్రశంసాపత్రాలు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ అందించారు. ఈ సందర్భంగా ప్రభుచరణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకే ప్రతి సంవత్సరం చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు సువర్ణ దేవి, నాగరత్న, సుధారాణి, వేదవాణి, షఫీ విద్యార్థులు పాల్గొన్నారు. **రామసముద్రం :** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పరీక్ష విజయవంతంగా ముగిసిందని ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు అన్నారు.ఈ పరీక్షకు రామసముద్రం మండలంలోని చెంబకూరు, మట్లవారిపల్లి ,రామసముద్రం, మోడల్ పాఠశాల, కెజిబివి, కెసి.పల్లి పాఠశాలల నుంచి 18 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో మొదటి స్థానం పొందిన చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇ.యోగానంద్,పి.ఫిరోజ్ ఖాన్, డి.సంగీత లు మొదటి స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో మోడల్ స్కూల్ విద్యార్థులు ఎ.చందన ,డి.శృతి, ఎల్.మేఘన లు నిలిచారు. తృతీయ స్థానంలో రామసముద్రం జడ్పి హైస్కూల్ విద్యార్థులు ఎం.అరుణ్ కుమార్ జి. రెడ్డి బాషాసి. కావ్య ఎంపికైనారు. వీరు జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభసాటి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రకృతి వ్యవసాయం రైతుకు అన్ని విధాల మేలు చేస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ డిపిఎం రామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువ మాచిరెడ్డిగారిపల్లెలో, ప్రవల్లిక, రాజేష్ దంపతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ మిరప పంటను పరిశీలించారు. పంట సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. వారు అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. పంట మేలైన దిగుబడికి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం లాభసాటని ఖర్చులు ఆదా అవుతాయన్నారు. రసాయనిక ఎరువులపై పెట్టే పెట్టుబడి మొత్తం రైతుకు మిగులుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

కోవిడ్ వేరియంట్‌పై మాక్ డ్రిల్

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ కొత్త వేరియంట్ పై మాక్ డ్రిల్ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ వెంకట్రామయ్య కొత్త వేరియంట్ నివారణకు ముందస్తు చర్యలలో భాగంగా వైద్య సిబ్బంది సంసిద్ధంగా ఉండాలన్నారు. కోవిడ్ వార్డులో ఆక్సిజన్, బెడ్స్ ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్లు కోవిడ్ పరీక్షల నిర్వహణ పనితీరు ప్రయోగాత్మకంగా వివరించారు. కోవిడ్ బాధితులను ఆదుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలతో వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి :'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన మండల వైసిపి కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 28న రాయచోటిలో జరిగే బిసి సాధికారిక బస్సు యాత్రను జయప్రదం చేయలన్నారు. బడుగు, బలహీన వర్గాల సాధికారత, అభివృద్ధిని యాత్రల వైసిపి వివరిస్తోందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల అభివృద్ధికి సంకేతంగా సామాజిక సాధికార బస్సుయాత్రలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మండలంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.300 కోట్ల నిధులను డిబిటి ద్వారా లబ్ధి పొందినట్లు తెలిపారు. జనవరి 1 నుంచి రూ.3 వేలు పెన్షన్ అందుతుం దన్నారు. ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న పోరాటంలో ధర్మానికి తోడుగా నిల వాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ యదుభూషన్ రెడ్డి, ఎస్ కె ఖాదర్ మోహిద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషన్ రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి, వైస్ ఎంపిపి2 గాలి శ్రీనివాసులు, మాజీ ఎంపిపి బండి చిన్నరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌రెడ్డి, గుమ్మా అమరనాథరెడ్డి, పప్పిరెడ్డి మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, దీప్తి, ఉమాపతిరెడ్డి, కేశవరెడ్డి, ఉమాప్రభాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న పారిశుధ్య కార్మికులు

వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-నందలూరు

పండుగ వస్తోంది వేతనాలు ఇప్పించాలని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి విన్నవించుకున్నారు. శుక్రవారం ఉరుసు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను రైల్వే కేంద్రంలో కలిసి గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకవచ్చారు. అప్పులు చేసి జీవనాన్ని కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే స్థానిక సర్పంచ్ సూర్యనారాయణ ను ఆదేశించడంతో రెండు నెలల జీతాలు వెంటనే చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు నరసింహులు,రామాంజనేయులు, కొండయ్య, నాగరాజు, ప్రసాదు, కుమార్, వెంగమ్మ, సుశీలమ్మ, జ్యోతి, దియ్యాల పద్మ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి-గాలివీడు

మృతి చెందిన ఆవు

గాలివీడు పంచా యతీ పెద్దరు కస్పాలోని పఠాన్ మస్తాన్‌బాషాకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గుర్రై మృతి చెందింది. గురు వారం సాయంత్రం బయటకు పోయినా ఆవు ఇంకా తిరిగి రాలేదని రైతు పొలం వద్ద వెళ్లి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. ఈ విష యాన్ని పశు వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తన ఆవు మృతి చెందిందని బాధితుడు మస్తాన్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. మూగజీవాలకు ప్రాణహాని కలుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐగా సుమతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన సుమతి

పట్టుదల, క్రమశిక్షణ, అంకిత భావం కలిగి ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చునని కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన మహిళా కానిస్టేబుల్ సుమతి నిరూపించారు. మదనపల్లె మండలం ఇసుకనూతపల్లికి చెందిన వేణుగోపాల్, భాగ్యమ్మ దంపతుల కుమార్తె బరినేపల్లి సుమతి మహిళ పోలీస్ కానిస్టేబుల్ గా నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఎస్ఐ ఎంపిక పరీక్ష తుది ఫలితాల్లో ఎస్ఐ ఉద్యోగం సాధించింది. తండ్రి వేణుగోపాల్ కౌలు రైతు కాగా, తల్లి భాగ్యమ్మ పాడిఆవులు పోషించుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం కాగా మొదటి కుమార్తె అమరావతికి వివాహం అయింది, కుమారుడు రవికుమార్ వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు. చివరి సంతానమైన సుమతి ప్రాథమిక విద్యాభ్యాసం ఇసుకనూతపల్లె ఎంపియుపి స్కూల్లోనూ, ఉన్నత విద్య మదనపల్లె జడ్‌పి హైస్కూల్లోనూ, ఇంటర్మీడియట్ విశ్వ సాధన కాలేజీలోచదివింది. మదనపల్లె జ్ఞానాంబిక కాలేజీలో 2017లో డిగ్రీ పూర్తి చేసింది. 2018 సంవత్సరంలో విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికై, అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి డిపిఒ కార్యాలయంలోనూ, నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ గానూ పనిచేశారు. 2022 డిసెంబర్‌లో విడుదలైన ఎస్ఐ పోస్టుల నోటిఫికేషన్ ద్వారా రెండవ ప్రయత్నంలో ఎస్ఐ ఉద్యోగం సాధించింది. తన లక్ష్యాన్ని సాధించేందుకు తల్లిదండ్రులు కుటుంబ సభ్యులతో పాటు, ఎఎస్‌పి డాక్టర్ రాజ్‌కమల్, పోలీసు ఉన్నతాధికారులు సహకారంతో పాటు ప్రోత్సాహం అందించారని సుమతి చెప్పారు. ఈ సందర్భంగా సహచర పోలీస్ సిబ్బంది,పలువురు ఆమెను అభినందించారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

తంబళ్లపల్లి : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం కోసువారి పల్లె పిహెచ్‌సి సందర్శించారు. డాక్టర్ అనుపమ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది పనితీరు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి ,నాయకులు శంకర్ రెడ్డి, రఘు ఉన్నారు.

క్రైం కార్నర్

పట్టుబడిన వాహనం, ఎర్రచందనం దుంగలతో అటవీ శాఖ నిఘా విభాగం బృందం

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

అక్రమంగా తరలిస్తున్న 16 ఎర్రచందనం దుంగలతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి డివిజనల్ పీలేరు అటవీ శాఖ నిఘా విభాగం డిఎఫ్ఒ ఎం. శివకుమార్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పట్టణంలోని ఎల్లమంద క్రాస్ సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా ఉదయం 4 గంటలకు మారుతి స్విఫ్ట్ డిజైర్ వాహనం రావడం గమనించి ఆపేందుకు ప్రయత్నించామన్నారు. ఆ వాహన డ్రైవరు యూనిఫాంలో ఉన్న తమ బృందాన్ని గుర్తించి వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లిపోయాడని చెప్పారు. అప్రమత్తమైన తమ బృందం వెంటనే ఆ వాహనాన్ని వెంబడించగా ఆ వాహనం కొంత దూరం ఆపి అందులోని వారు బయటకు దూకి, చీకట్లో చెట్ల పొదల్లోకి పారిపోయారని చెప్పారు. వాహనంలో తనిఖీ చేయగా అందులో 565 కేజీల బరువు గల 16 ఎర్రచందనం దుంగలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఒ కె. వెంకటేశ్వర్లు, ఎఫ్‌బిఒలు డి. రమణమూర్తి, జి. కొదండన్, వై. చంద్రబాబు, ఎబిఒ ఎం. ప్రసాద్ కుమార్, స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది పి. మునిస్వామి, డి.భార్గావ్, కె.ధర్మచందు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒ ప్రశాంత్ తెలిపారు. కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే అందిన సమాచారం మేరకు మండలంలో శుక్రవారం తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని తెలిపారు. మండలంలోని గోల్లపల్లి పంచాయతీ, చీకుచెట్టుపల్లి కోళ్లఫారం వద్ద ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి 103.6 లీటర్ల పరిమాణం కలిగిన 1152 హైవార్డ్స్ విస్కీ, కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు రిమాండుకు తరలించామన్నారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు.